అరెస్ట్ అయిన గోసాయి కొండన్న

బెదిరించాలని చూస్తే బెడిసికొట్టింది..

- ఫిల్మ్‌నగర్‌లో మృతిచెందిన గృహిణి...భర్త అరెస్ట్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః రోజు మద్యం సేవించి వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్న భర్తను బెదిరించాలని చూసిన ఒక భార్య పథకం బెడిసికొట్టింది. మద్యం మత్తులో భర్త చేసిన పనికి ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. కర్నూలు జిల్లా నందవరం మండలం పొనకాలదిన్నె గ్రామానికి చెంది ఫిల్మ్‌నగర్ వినాయకనగర్‌లో నివసిస్తూ కూలీగా పనిచేసే గోసాయి కొండన్న అలియాస్ కొండల్‌కు అరుణతో వివాహమైంది. రోజు మద్యం సేవించి వచ్చే కొండల్‌తో మద్యం తాగొద్దని తరుచూ భార్య గొడవ పడుతూ ఉండేది. కాగా ఆదివారం సాయంత్రం మద్యం సేవించి వచ్చిన భర్తతో భార్య గొడవకు దిగింది. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. అరుణపై భర్త చేయిచేసుకోవడంతో ఆమె మనసు నొచ్చుకుంది. ఆమె ఆత్మహత్య చేసుకుంటానంటూ అతని కళ్ల ముందే సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీ బిగించి స్టూలు వేసుకొని చున్నీ మెడకు చుట్టుకొని భర్తను బెదిరించింది. మద్యం మత్తులో ఉన్న కొండయ్య ఒక్కసారిగా స్టూలును తన్నడంతో ఆమె స్టూలు మీది నుంచి కింద పడే క్రమంలో గోడను పట్టుకొని నిలబడటానికి ప్రయత్నం చేసింది. కాని కొండల్ ఆమె చేయి లాగడంతో చున్నీ మెడకు బిగుసుకుపోయి ఆమె మృతిచెందింది. ఇరుగుపొరుగు సమాచారం అందించడంతో ఫిల్మ్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేశారు. నిందితుడైన గోసాయి కొండన్నను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

హైదరాబాద్ వార్త

నిర్లక్ష్యమే ..నిప్పురాజేస్తోంది!

- షార్ట్‌సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు అవసరం
- గృహాలు,ఆఫీసుల్లో అదనపు లోడ్ పడకుండా చూసుకోవాలి
- ప్రతియేటా విద్యుత్ తీగల తనిఖీ ..
- లైసెన్స్‌డ్ ఎలక్ట్రీషియన్‌తోనే మరమ్మతులు చేయించాలి
- ఐఎస్ఐ మార్కు విద్యుత్ తీగలు ..స్విచ్ బోర్డులనే వాడాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త: ఈమధ్యకాలంలో ప్రతి ఇంట్లో, కార్యాలయంలో గృహోపకరాలు ఎక్కువైపోయాయి. అన్నీ ఉన్నాయంటే ..ఇక ఆఇళ్లలో కానీ, కార్యాలయాల్లోగానీ విద్యుత్ వాడకం కూడా ఎక్కువగానే ఉంటుంది. సాధారణంగా షార్ట్ సర్క్యూట్ గురించి వినిఉంటాం. మనం రోజువాడే డివైజ్‌లల్లో ఆపరేటింగ్ కరెంట్ అనుకున్న యాంపియర్ల కంటే ఎక్కువ మించితేషార్ట్ సర్క్యూట్ అయ్యేవకాశం ఉంది. దీంతో పెను ప్రమాదాలు సంభవిస్తున్న సందర్భాలు ఉన్నాయి. అందుకే విద్యుత్ విషయంలో ఎలాంటి పొరపాటు చేయకూడదు. అలాగే మార్కెట్‌లోతక్కువ ధరలకు లభిస్తున్న ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు ఇతర నాణ్యత లేని ఎలక్ట్రికల్ వస్తువులు వాడితే షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదాలున్నాయని విద్యుత్‌రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధర తక్కువగా ఉందని ఇళ్లలో ఇష్టానుసారంగా గృహోపకరణాలు వాడితే భారీ మూల్యం చెల్లించక తప్పదని ముఖ్యంగా వేసవిలో షార్ట్ సర్క్యూట్ జరిగేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయని తెలుపుతున్నారు. లోడ్ ఎక్కువ పడుతుంది అనుకున్నప్పుడు ముందే జాగ్రత్తలు తీసుకుంటే విద్యుత్ ప్రమాదాలు నివారించవచ్చునని తనిఖీ అధికారులు సూచిస్తున్నారు. గృహాలు, ఆఫీసులల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకోలంటున్నారు. ముఖ్యంగా వేసవిలో వాణిజ్య కేంద్రాలు, దుకాణాలు, బహుళ అంతస్తులు,గోదాములతోపాటు గృహాల్లో షార్ట్‌సర్యూట్ ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. మాల్స్,వాణిజ్యసముదాయాల్లో రాత్రి మూసివేసేముందు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతి సంవత్సరం గృహాలు, ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో విద్యుత్ వైరసింగ్ సిస్టమ్‌ను లైసెన్స్ తీసుకున్న టెక్నీషియన్లతో తనిఖీ చేయించుకోవాలని తెలుపుతున్నారు.

నగరంలో చాలా వరకు ఇళ్లలో ఏళ్లతరబడి విద్యుత్ తీగలు మార్చకుండా, స్విచ్‌బాక్సులు పాతవేవాడుతుండటంతో తీగలపై అదనపు లోడ్‌పడి విద్యుత్ తీగలు కాలిపోయే ప్రమాదం అధికంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

లోడ్‌కు తగినట్లు వినియోగం ఉండాలి ..

విద్యుత్ కనెక్షన్ ఉన్నచోట లోడ్ అనుమతి వరకే వినియోగించాలి. లోడ్‌పెరిగితే విద్యుత్ తీగలు కాలిపోయే ప్రమాదం ఉంది. ఎండలో విద్యుత్ తీగలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండవేడికి తీగలపై ఉన్నరబ్బర్ మొత్తబడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. గృహాలు, ఆఫీసుల్లో విద్యుత్ పనులను లైసెన్స్ పొందిన కాంట్రాక్టర్లతో చేయించుకోవాలి. తరుచూ తనిఖీలు నిర్వహిస్తుండాలి. ఎర్తింగ్ సమగ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఏదైనా విద్యుత్ ఘా తమైతే ఎర్తింగ్ ఉండటం వల్ల ఎంసిబి ట్రిప్ అయి సరఫరా నిలిచి పోతుంది. విద్యుత్ వైరింగ్‌ను 4 చ.మిల్లీమీటర్ల మందం కలిగిన తీగలు ఇళ్లలో వినియోగించుకోవాలి. విద్యుత్ తీగలకు అతుకులు లేకుండా చూసుకోవాలి. అతుకుల తీగలతో లోడ్ పెరిగినప్పుడు స్పార్క్స్ వచ్చి ప్రమాదాలకు కారణమవుతాయి.

వైరింగ్‌లో జాగ్రత్తలు తప్పనిసరి ..

విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన ఎలక్ట్రానిక్ సామాగ్రి ఉపయోగించాలి. ఉదా: 10యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 20యాంప్స్ విద్యుత్ భారంపడే పరి కరాలు వినియోగిస్తే తీగలు కాలిపోతాయి. నాసిరకం వల్ల విద్యుత్ వృధాఅవుతుంది. ఇన్సులేషన్ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి. ప్రతిఇంట్లో ,చిన్న వాణిజ్య భవనాల్లో న్యూట్రల్ పరికరాల కోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి. భూమిలోని తేమ, ఉష్ణోగ్రత ఎర్తింగ్ సిస్టమ్‌పై ఆధారపడుతోంది. ఎండకాలం లో రక్షణ పరికరాలు సరిగ్గా పనిచేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతి లో ఉంచేందుకు నీరు ,దొడ్డు ఉప్పు వినియోగించాలి. గృహాలు, కార్యాలయాల్లో విద్యుత్‌వాడేందుకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకే ట్లు మాత్రమే ఉపయోగించాలి. ఒకేస్విచ్‌బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే లోడ్ పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఇళ్లలో కొత్తగా విద్యుత్ ఉపకరణాలు పెట్టేందుకు అవసరమైన కనెక్టడ్ లోడ్ ఉందో లేదో చూసుకోవాలి. అందుకు తగిన ట్లు వైరింగ్ ఏర్పా టు తర్వాతే ఏసీలు, వాటర్ హీటర్స్ ,మైక్రో ఓవెన్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించుకోవాలి. విద్యుత్ స్థంబాల నుంచి మీటర్ వరకు ఉండే సర్వీస్‌వైర్లను రెండు సంవత్సరాలకు ఒక సారి మార్చు కోవాలి. సింగిల్ ఫేజ్ సర్యూట్‌లో ఫేజ్, న్యూట్రన్, ఎర్త్, వైర్లు సమానపరిణామంలో ఉండేలా చూసుకోవాలి. రక్షణ పరికరాలైన ఎంసిబి (మైక్రో సర్యూట్ బ్రేకర్) ఎంసిసిబి (కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులు బైపాస్ చేయకూడదు. లైటింగ్ సర్యూట్ కొరకు 30మిల్లీ యాంప్స్ ఈఎల్‌సిబి, ఆర్‌సిసిబి పవర్ సర్యూట్‌లో 100మిల్లీ యాంప్స్ ఈఎల్‌సిబి, ఆర్‌సిసిబి వినియోగించాలి.

అంతరించిపోతున్న హరికథ కళారూపాలను బ్రతికించుకోవాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: నేటి కాలంలో టీవీలు ప్రసార మాధ్యమాలు రావడం వల్ల హరికథ వంటి కళలు అంతరించిపోతున్నాయని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి నల్లకుంటలోని శృంగేరి శంకరమఠంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినోత్సవాలను పురస్కరించుకుని 'హరికథా మహోత్సవాలు' అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న కళారూపాలను తిరిగి పూర్వవైభవం తీసుకురావడానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.వి.రమణాచారి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హరికథాభాగవతారిణి సప్పా భారతిచే 'భీష్మ ప్రతిజ్ఞ' హరికథాగానం అద్భుతంగా సాగింది. హరికథా గాన కార్యక్రమానికి వయోలిన్‌పై ధూళిపాల శ్రీనివాస మూర్తి, మృదంగంఎపై రాయప్రోలు సుధాకర్ వాద్యసహకారాన్ని అందించారు. కార్యక్రమంలో చారిత్రక నవలా చక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్, నిర్వాహక సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరై అద్భుతంగా హరికథ గానం చేసిన భాగవతారిని భారతిని సత్కరించి అభినందించారు.

హరికథాభాగవతారిణి సప్పా భారతిలను సత్కరిస్తున్న తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

మహిళ భవనంలోకి రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దు

అత్తాపూర్ ఫిబ్రవరి 2,ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మహిళా భవనంలోకి తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆఫీస్ తరలింపు పనులను వారు అడ్డుకున్నారు. మహిళల కోసం కేటాయించిన భవనంలో రిజిస్టర్ కార్యాలయం పెడితే తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మహిళ సంఘాలు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి, డిఆర్‌వో వెంకటాచారి, డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త: జిల్లాలోని అన్ని ఆసుపత్రులలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి రూపొందించిన డైరీ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. సోమవారం కలెక్టెట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ హైదరాబాద్ డైరీ, క్యాలెండర్‌ను డిఆర్ఓ ఈ వెంకటాచారి, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటి లతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్ అలాగే ఆశాఖకు సంబంధించిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై పూర్తిగా, సవివరంగా సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యే రీతిలో పూర్తి సమాచారం రూపొందించారని ఈ సందర్భంగా అభినందించారు. ఈ డైరీ ఆశా కార్యకర్త నుండి, సూపర్వైజర్ స్టాఫ్, మెడికల్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్‌కు అందరికీ ఉపయోగకరంగా ఉందని అన్నారు.ఈ డైరీలో ప్రతి నెల వారిగా జరిగే ఆరోగ్య దినోత్సవాల సమగ్ర సమాచారాన్ని పొందుపరిచారని సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ ఆఫీసర్ డాక్టర్ చల్లాదేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీధర్, డా: శ్రీకళ, డా: సాయిబాబా,మాస్ మీడియా అధికారి జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

చర్లిగాగిల్లాపూర్‌లో వృద్దురాలి హత్య

దుండిగల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: గుర్తు తెలియని దుండగులు ఓ వృద్దురాలిని హత్య చేసిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుండిగల్ సర్కిల్ పరిధి చర్లిగాగిల్లాపూర్‌కు చెందిన చిన్నబత్తిని సుశీలమ్మ(75) అనే వృద్దురాలు తన మనవడితో కలిసి నివాసం ఉంటుంది. తను నివాసం ఉంటున్న ఇంటికి ముందు ప్రధాన రహదారి వైపు ఉన్న గదులు అద్దెకు ఇస్తూ జీనవం కొనసాగిస్తుంది. సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి తన వ్యాపారం కోసం గది అవసరం ఉండగా అడిగేందుకు సుశీలమ్మ ఇంటికి వెళ్ళగా అక్కడ ఆమె విగత జీవిగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా మృతురాలి తలపైన బలమైన గాయాలు కనిపించడంతో హత్య జరిగినట్లు గుర్తించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.

పెట్రోల్ బంక్ ఉద్యోగిపై దాడి చేసిన యువకులు అరెస్ట్

ముషీరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని భారత్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ఉద్యోగిపై దాడి చేసిన ముగ్గురు యువకులను దోమలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. దోమలగూడ సీఐ అమ్జద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో భోలక్‌పూర్‌కు చెందిన బాసిత్ (20), గౌస్ (24), తాహిర్ (26)లు పెట్రోలు పోయించుకోవటానికి పెట్రోల్ బంక్‌కు వచ్చారు. పెట్రోల్ బంక్‌లో పనిచేసే కిషన్ అనే వ్యక్తి పెట్రోల్ పోస్తూ ఉండగా కిషన్‌తో నిందితులు గొడవ పడి, కిషోన్ పై దాడి చేశారు. స్వల్పంగా గాయపడిన కిషన్‌ను సహోద్యోగి సొహైల్ సమీపంలోని సాయివాణి ఆసుత్రికి తీసుకువెళ్లి, చికిత్స చేయించాడు. కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాసిత్, గౌస్, తాహిర్‌లపై హత్యాయత్నం మరియు ఆయుధ చట్టం కింద కేసు నమోదు చేసి, వారిని అరెస్ట్ చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

భాగ్యలక్ష్మీ మందిరంలో మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ పూజలు

చార్మినార్ భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహించిన మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్,తెలంగాణ బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు

చార్మినార్,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని సోమవారం రాత్రి మహారాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,సాంస్కృతిక వ్యవహారాల శాఖల మంత్రి ఆశిష్ షెలార్ తెలంగాణ బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్ రావుతో కలిసి సందర్శించారు.మందిరం ట్రస్టీ శశికళ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.మహారాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,సాంస్కృతిక వ్యవహారాల శాఖల మంత్రి ఆశిష్ షెలార్ చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో పలువురుబిజెపి నాయకులు పాల్గొన్నారు.చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

'బడ్జెట్'లో రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేయటంపై కాంగ్రెస్ 'గాడిద గుడ్డు' నిరసన

చాంద్రాయణగుట్ట చౌరస్తాలో 'గాడిద గుడ్డు' ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చెయ్యి చూపటాన్ని నిరసిస్తూ చాంద్రాయణగుట్ట నియోజక వర్గ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సోమవారం చాంద్రాయణగుట్ట చౌరస్తాలో 'గాడిద గుడ్డు' ప్లకార్డుతో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నియోజక వర్గ ఇంచార్జ్ బోయ నగేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు తగిన నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కలు అనేక సార్లు ప్రధాని నరేంద్ర మోదిని, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకోక పోవటం కేంద్రానికి రాష్ట్రాలపై ఉన్న సవతితల్లి ప్రేమ స్పష్టమవుతుందన్నారు. ప్రధానంగా మూసీ పునర్జీవనం, ఆర్‌ఆర్‌ఆర్, గ్రీన్ ఫీల్డ్ హైవే, బయోఫార్మా, సెమీ కండక్టర్, మెట్రో రైలు, కొత్త రైల్వే లైన్లు తదితరాలకు రూపాయి విదల్చలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న ఆశలపై నీళ్లు చల్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్ట్‌లకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతబస్తీలో ఇష్టారాజ్యంగా మద్యం వ్యాపారులు

- దర్జాగా రోడ్లు కబ్జా
- వాహనాల అక్రమ పార్కింగ్
- పర్మిట్ రూమ్‌లలో వివాదాలు
- అయినా పట్టని అధికారులు

మద్యం దుకాణం వద్ద నడిరోడ్డుపై నిలిపిన వాహనాలు

రాజన్నబావి వద్ద అక్రమ పార్కింగ్‌ను నియంత్రిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : పాతబస్తీలోని మద్యం దుకాణాలు ఓపెన్ బార్లను తలపిస్తున్నాయి. ప్రభుత్వ లైసెన్స్‌తో నడుపుతున్నామన్న ఇదితో వ్యాపారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పర్మిట్ రూమ్‌లు వివాదాలకు అడ్డాలుగా మారుతున్నాయి. స్థానిక పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పైగా మద్యం వ్యాపారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అండగా నిలుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వ్యాపారులు అమ్మిందే మద్యం బెదిరింపే నిత్యంగా మారింది. పలు ప్రాంతాలలో ప్రధాన రోడ్లపై ఉన్న మద్యం దుకాణాలు, బార్ల వద్దకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను ఇష్టారీతిన నిలుపుతున్నారు. ఫలితంగా రోడ్లు ఇరుకై నడవలేని పరిస్థితి నెలకొంది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఆ మార్గంలో మహిళలు, విద్యార్థినులు వెళ్ళాలంటే ఇబ్బంది పడుతున్నారు. అయినా వారు అమ్మ కాలపై చూపుతున్న శ్రద్ధ తమ వద్దకు వచ్చే కస్టమర్ల గురించి పట్టించుకోవటం లేదు. సాయంత్రం వేళ సమస్య తీవ్రంగా ఉంటుంది. వీరిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవటం లేదు. గతంలో సిటీ కళాశాల కుడా మైదానం వద్ద ఉన్న చార్మినార్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ను మలక్‌పేట్ కాలనీకి తరలించారు. ఐదారు కిలోమీటర్ల దూరంలో గల కార్యాలయం నుండి పాతబస్తీలోని మద్యం దుకాణాలను నియంత్రించలేక పోతున్నారు. వీరి ఆకస్మిక తనిఖీలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. మద్యం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం రాబట్టడంలో చూపుతున్న ఆసక్తి తనిఖీలపై లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాతనగరంలోని చాంద్రాయణగుట్ట, శంషీర్‌గంజ్, రాజన్నబావి, లాల్‌దర్వాజా మోడ్, గౌలిపురా, ఛత్రినాక, ఉప్పుగూడ జెండా, తానాజీనగర్ తదితర ప్రాంతాలలో గల మద్యం దుకాణాలు, బార్లు ప్రధాన రోడ్లకు ఆనుకొని ఉన్నాయి. ఆయా ప్రాంతాలలోని రహదారులు ఇప్పటికే ఇరుకుగా ఉన్నాయి. ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలతో తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు మద్యం దుకాణాలు, బార్ల వద్దకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. ఆ ప్రాంతంలో రోడ్డు ఇరుకై వాహనాలు ముందుకు వెళ్ళలేక ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కొందరైతే రోడ్లను దర్జాగా కబ్జా చేస్తున్నారు. మరికొందరు సమీప ఇళ్లు, వ్యాపార సముదాయల ముందు వాహనాలను నిలిపి మద్యం దుకాణాలు, బార్లలోకి వెళ్ళి మద్యం సేవిస్తున్నారు. గంటల తరబడి వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. స్థానికులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. రాత్రైతే ఇళ్లు, దుకాణాల ముందు తిష్టవేసి మద్యం సేవిస్తున్నారు. తమ గోళతో స్థానికులకు నిద్ర లేకుండా చేస్తున్నారు. వ్యాపారులు తమ వ్యాపారంపైనే దృష్టి పెడుతన్నారే తప్పా స్థానికుల ఇబ్బందులను పట్టించుకోవటం లేదు. ఎవరైనా ప్రశ్నిస్తే స్థానిక పోలీసుల అండతో బెదిరిస్తున్నారు. ఇటీవల ఉప్పుగూడలోని ఒక బార్లో ఒక వ్యక్తి మరణించాడు. శంషీర్‌గంజ్ ప్రాంతంలోని ఒక మద్యం దుకాణం పర్మిట్ రూమ్‌లో గొడవ జరిగి ఒకరి హత్యకు దారి తీసింది. అదే ప్రాంతంలో ఉన్న మరో మద్యం దుకాణంలో ఒక వ్యక్తి మరణించాడు. రాజన్నబావి వద్ద గల మద్యం దుకాణం ముందు మందుబాబులు తమ వాహనాలను రోడ్డుపై ఇష్టారీతిన నిలిపి ట్రాఫిక్ సమస్యకు కారణమైతున్నారు. ఛత్రినాక ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు చొరవ తీసుకొని సదరు వాహనదారులకు ఛాలానా విధించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎంతో మంది మద్యం సేవించి బార్లు, మద్యం దుకాణాల వద్దే రోడ్లపై పడిపోతున్నారు. ఇలా పలు దుకాణలలో అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అయినా ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు పెద్దగా పట్టించుకోవటం లేదు. వారిని నియంత్రించటం లేదు. ఈ విషయమై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని పాతనగర ప్రజలు కోరుతున్నారు.

పెళ్లిగోల..మాయలీల...!

- పెట్రేతుగుతున్న నకిలీ మ్యాట్రిమోనీలు
- పెళ్లిళ్ల పేరుతో లక్షలు దోచేస్తున్న కేటుగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 ,ప్రభాతవార్త: మూడు పదులు దాటిన వయస్సు..ముదురు బెండకాయ అంటూ బంధుగణం విమర్శలు..నచ్చిన సంబంధం కోసం నానా తంటాలు..ఏదో ఒక పెళ్ళి సంబంధం ఖాయం చేసుకుందామనే ఆలోచనతో ఆన్‌లైన్‌లో వెతుకులాట..అందమైన వదువు ఉందనే ప్రకటన కనిపించగానే పరుగెత్తుకుంటూ వెళ్లడం. బ్రహ్మచారుల పెళ్లిపాట్లను పసిగట్టిన మాయగాళ్లు సరికొత్త మోసాలకు శ్రీకారం చుట్టారు. చేతికి అందినంత లాగేసి వదిలేస్తున్నారు. అమాయకులకు వల విసిరేందుకు ప్రకటనలు,సోషల్‌మీడియా వేదికలుగా మారాయి. వీరి వలలో చిక్కి సొమ్ముపోగొట్టుకున్న బాధితుల్లో ఎక్కువగా సంపన్న వర్గాలకు చెందిన వారు,విద్యావంతులే ఉంటున్నారు. ఇటీవల మ్యారేజ్ బ్యూరోల చేతిలో మోసపోయి చాలామంది పోలీసులను ఆశ్రయిస్తున్నారు. డబ్బులు వసూలు చేయడమే టార్గెట్‌గా కేటుగాళ్లు మ్యాట్రిమోనీల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. అందుకు భర్తతో విడిపోయి.ఒంటరిగా ఉంటూ,ఉన్నత ఉద్యోగాలు ,వ్యాపారాలు బాగా డబ్బున్న వారిని ఎంచుకుంటున్నారు. వారి అమాయకత్వాన్ని ఒంటరి తనాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. మీకు మేమున్నాం అని భరోసా కల్పించి ఒంటరి జీవితంలో ఆశలు రేకెత్తిస్తున్నారు. మాయ మాటలతో మచ్చిక చేసుకుని,వారి బలహీనతను అడ్డంపెట్టుకుని,వివిధ రకాల కారణాలు చెప్పి అందినకాడికి దోచుకుంటున్నారు. ఆతర్వాత ముఖం చాటేసి అడ్రస్‌లేకుండా పోతున్నారు. తాము మోసపోయామని గ్రహించిన కొందరు పోలీసులు, కోరులు,కేసులు అంటూ తిరిగి సమాజంలో పలుచన కావడం ఇష్టం లేక మిన్నుండిపోతున్నారు.

బిసి అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలి

కామరాజుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న గవ్వల భరత్‌కుమార్

సైఫాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో బిసిలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సమరశీల పోరాటాలను నిర్వహించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ మేరకు సోమవారం నాడిక్కడ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా కామరాజు సతీష్‌కుమార్‌ను నియమించి, నియామక ప్రతాన్ని అందజేశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు కామరాజును నియమించడం జరిగిందన్నారు. వచ్చే మున్సిపల్, జిహెచ్‌ఎంసి, ఎంపిటిసి ఎన్నికల్లో బిసి అభ్యర్థులు విజయం సాధించేందుకు బిసిలు పెద్ద ఎత్తున కృషి చేయాలని కోరారు. సతీష్‌కుమార్ మాట్లాడుతూ జంటనగరాలో బిసి ఎదుర్కొరటున్న సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచిగారి ప్రవీణ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అభిలాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్ హుస్సేన్ జయంతి

కార్యక్రమంలో పాల్గొన్న మాజీ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : జామియా మిలియా ఇస్లామియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జామియా మిలియా ఇస్లామియా సెంట్రల్ యూనివర్శిటిలోని డాక్టర్.ఎం.ఎ .అన్సారీ ఆడిటోరియంలో జరిగిన ఇమామ్ హుస్సేన్ జయంతి కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గానికి చెందిన మాజీ రాష్ట్ర బిజెపి అధికారప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన పాతబస్తీ నూర్‌ఖాన్ బజార్‌లో మాట్లాడుతూ ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా సెంట్రల్ యూనివర్శిటిలోని డాక్టర్.ఎం.ఎ .అన్సారీ ఆడిటోరియంలో ఘనంగా ఇమామ్ హుస్సేన్ జయంతి కార్యక్రమం జరిగిందని,దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారని తెలిపారు.

కాలాపత్తర్,కామాటిపుర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఫ్లాగ్‌మార్చ్

ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఫలక్‌నుమా ఏసిపి జావిద్,కాలాఫత్తర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ ఫాషా

చార్మినార్,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో అత్యంత కీలకమైన కాలాఫత్తర్ పోలీస్ స్టేషన్,కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆదివారం రాత్రి ఫలక్‌నుమా ఏసిపి జావిద్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ఫలక్‌నుమా ఏసిపి జావిద్,కాలాఫత్తర్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ ఫాషా స్థానిక పోలీసులతో పాటు ర్యాపిడ్‌యాక్షన్ బలగాలతో కలిసి కాలాఫత్తర్, ఇంద్రానగర్,ఖాజాపహాడి బస్తీలలో పర్యటించారు.ఈ సందర్భంగా ఫలక్‌నుమా ఏసిపి జావిద్ మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి పుకార్లను నమ్మవద్దని,శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు తమ సహకారాన్ని పోలీసులకు అందించాలని కోరారు.కాగా కామాటిపుర పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం పురానాపూల్,దర్వాజ,దేవిబాగ్ రహదారి,బహదూర్‌పుర చౌరస్తా ప్రాంతాలు వరకు కొనసాగింది.ఈ కార్యక్రమంలో కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పలువురు పోలీస్ అధికారులు, పాల్గొన్నారు.

లోక కళ్యాణం కోసం సుదర్శన హోమం

సుదర్శన యజ్ఞంలో పాల్గొన్న స్థానికులు

నాచారం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : బీజేపీ మేడ్చెల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు, రేణుక ఆధ్వర్యంలో సోమవారం నాచారం కార్తికేయ నగర్‌లో లోక కళ్యాణం కోసం సుదర్శన హోమం నిర్వహించారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అర్చకులు నరసింహ మూర్తి పర్యవేక్షణలో అర్చక బృందం అంగరంగ వైభవంగా సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు హోమం ప్రాముఖ్యత విశిష్టత గురించి భక్తులకు ఉపదేశించారు. సుదర్శన హోమం నిర్వహించడం ద్వారా నిర్వహకులతో పాటు స్థానిక ప్రజలకు అనేక శుభఫలితాలు లభిస్తాయని పండితులు పేర్కొన్నారు. ఈ హోమం వలన శక్తివంతమైన యోగం ఏర్పడి, శత్రువులపై విజయం సాధించవచ్చని, దుష్టశక్తుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు.అలాగే వ్యాపార వృద్ధి, వృత్తి పరంగా ఆర్థిక సమృద్ధి, కుటుంబంలో శాంతి సౌఖ్యాలు కలుగుతాయని తెలిపారు. అధిక సంఖ్యలో మహిళలు భక్తులు తోపాటు బిజెపి, కాంగ్రెస్, టిడిపి నాయకుల తో పాటు పలువురు సంక్షేమ సంఘం నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ హోమం వలన శక్తివంతమైన యోగం ఏర్పడి, శత్రువులపై విజయం సాధించవచ్చని, దుష్టశక్తుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు.

టిఎల్ఎఫ్ అధ్యక్షురాలిగా వసంత కుమారి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః

మహిళా గ్రూపుల ఖైరతాబాద్ టౌన్ లెవల్ ఫెడరేషన్(టీఎల్ఎఫ్) నూతన కార్యవర్గాన్ని అధికారులు సోమవారం ప్రకటించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో నూతన కమిటీ వివరాలను అధికారులు వివరించారు. టీఎల్ఎఫ్ అధ్యక్షురాలిగా ఎం. వసంత కుమారి, ఉపాధ్యక్షురాలిగా కవిత, కార్యదర్శిగా సరోజ లక్ష్మి, సహాయ కార్యదర్శిగా ఎ. రమ, కోశాధికారిగా వి. ధనమ్మలను నియమించారు. మూడు సంవత్సరాల కాలపరిమితితో ఈ కమిటీ కొనసాగుతుందని యూసీడీ జాయింట్ కమిషనర్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. పొదుపు గ్రూపుల్లోని మహిళలకు అవగాహన కల్పించంతో పాటు వారు స్వయం ఉపాధి పొందే విధంగా ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డీపీవో శ్రీనివాస్, మెప్మా డీఎంసీలు భాను ప్రకాశ్, జయ కృష్ణ, సీవోలు బుచ్చమ్మ, భావ్‌సింగ్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలిలో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా క్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఫ్యాషన్ షో లో పాల్గొన్న నిత్య కళాకారులు

మహిళలను అక్రమ రవాణా చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న జయవింధ్యాల

సైఫాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: హైదరాబాద్ ఉమన్ సివిల్ రైట్స్‌అనే స్వచ్ఛంద సంస్థ పేరిట మహిళలను లైంగిక, దోపిడి, మహిళలఅక్రమ రవాణా లాంటి అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతున్న పాతనగరం బాబానగర్‌కు చెందిన నలోఫర్ బేగం నుంచి తమకు ప్రాణహాని ఉందని నలుగురు యువకులు ఆరోపించారు. సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ పౌర హక్కుల ప్రజా సంఘం (పియుసిఎల్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.బాలకిషన్‌రావు, జయవింధ్యాల బాధితులతో కలిసి మాట్లాడుతూ ఉమెన్ సివిల్ రైట్స్ పేరిట ఒక సంఘాన్ని నడుపుతూ యువతులకు వివిధ రకాల అశచూపి అరబ్ దేశాలతోపాటు ముంబాయి, పూణే తదితర నగారాలకు తరలించి వ్యభిచారం ర్యాకెట్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ సంస్థ బండ్లగూడ తదితర ప్రాంతాలలో మహిళల సేవా పేరిట అమాయక మహిళలను మోసం చేస్తూ రహస్యంగా చట్టవిరుద్ధ కార్యకలపాలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. ఈ విషయంలో పోలీసులకు సమాచారం ఉన్నప్పటికి చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ నీలోఫర్ బేగంకు వత్తాసు పలుకుతున్నారని వారు ఆరోపించారు. ఆమె రహస్యాలను తెలిసిన బాధితులను హత్య చేసేందుకు ఆమె కుమారులు అనుచరులతో కుట్ర పన్నుతున్నారని చెప్పారు. ఇప్పటికే పలుమార్లు రెక్కి చేసి బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఈ విఇయంపై కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లోనూ, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మహిళా సేవ పేరిట పాతనగంలో విస్తరించిన ఉమెన్ ట్రాఫికింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నలుగురు బాధితులకు ప్రాణ హాని ఉన్నందున రక్షణ కల్పించాలని కోరారు. స్థానిక పోలీసు వ్యవస్థ దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఉన్నత స్థాయిలో విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బాధితులు మహ్మద్ అమీర్ షరీఫ్, అబ్దుల్ వాసీమ్, అష్రఫ్ ఉన్నీసా, మహ్మద్ ఇబ్రహిం తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుడు షహీద్ నందరాజ్‌గౌడ్ : డా.గౌతంరావు

షాహీద్ నందరాజ్‌గౌడ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుడు షాహీద్ నందరాజ్‌గౌడ్ అని బీజేపీ రాష్ట్ర ప్రధన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావ్ కొనియాడారు. సోమవారం అయోధ్య కరసేవకుడు, బీజేపీ తిలక్‌నగర్ మాజీ కార్పోరేటర్, బీజేపీ యువమోర్చా గ్రేటర్ హైదరాబాద్ మాజీ అధ్యక్షులు షాహీద్ నందరాజ్ వర్ధంతి సందర్భంగా బాగ్ అంబర్‌పేటలోని అయ్యప్ప టెంపుల్ రోడ్డులో ఉన్న నందరాజ్‌గౌడ్ స్మారక స్థూపం వద్ద వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై, నందరాజ్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశం కోసం, ధర్మ రక్షణకోసం పోరాడిన మహనీయుడు నందరాజ్‌గౌడ్ అని, ఐ.ఎస్.ఐ ఉగ్రవాదుల చేతిలో హత్యకు గురై అమరుడయ్యారని గుర్తు చేశారు. నందరాజ్‌గౌడ్ త్యాగం స్ఫూర్తి దాయకమని, ప్రజల పక్షాన నిలబడి, న్యాయం ఆయన చేసిన పోరాటం, చిర స్మరణీయమని, ఆయన ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని, బీజేపీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ధనుంజయ్, చుక్క జగన్, నందరాజ్గఐడ్ సతీమణి లలిత నందరాజ్‌గౌడ్, రోహిత్‌గౌడ్, సెంట్రల్ జిల్లా బీజేపీ ఆఫీస్ కార్యదర్శి లంకల దీపక్‌రెడ్డి, మాజీ మంత్రి కృష్ణయాదవ్, రవి ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు నాగరాజుచారి పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలు

-గోడప్రతులను ఆవిష్కరించిన సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి

తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఏ.వి.కాలేజి ప్రిన్స్‌పాల్ డాక్టర్ రాజలింగం, తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఆనందాచారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: తెలంగాణ సాహితి దశాబ్ది ఉతనసవాలు ఈనెల 21, 22 తేదీలలో దోమలగూడలోని ఏ.వి.కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఆనందాచారి తెలిపారు. సోమవారం ఏవి కళాశాలలో కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ సి.హెచ్.రాజలింగం, పత్రికా సంపాదకులు ఆర్.రమేష్‌లతో కలసి ఆయన దశాబ్ది ఉత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనందాచారి మాట్లాడుతూ తెలంగాణ సాహితి పదేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు ఐదు లిటరరీ ఫెస్టలు నిర్వహించామని, 6వ ఫెస్టను దశాబ్ది ఉత్సవాలుగా ఏ.వి.కళాశాల తెలుగు శాఖతో కలసి సంయుక్తంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా డిగ్రీ, పిజీ విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ అనే అంశంపై కవితలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్స్‌పాల్ రాజలింగం మాట్లాడుతూ తెలంగాణ సాహితి నిర్వహిస్తున్న లిటరరీ ఫెస్ట్‌లో మా కళాశాల భాగస్వామ్యం కావటం మంచి అవకాశంగా భావిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు సాహిత్యాన్ని చేరువ చేయటానికి ఇలాంటి ఉత్సవాలు ఉపయోగ పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి రాష్ట్ర కోశాధికారి అనంతోజు మోహన్‌కృష్ణ, సహాయ కార్యదర్శి ఎస్‌కే.సలీమ, ఏవి కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ జి.భాస్కర్ యాదవ్, భౌతికశాస్త్ర విభాగ శాఖ అధ్యక్షులు మంజులదేవి, రసాయన శాస్త్ర విభాగ అధ్యక్షులు డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధారాణి, హరిప్రియ, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌని చెరువును కాపాడాలని హైడ్రాకు ఫిర్యాదు

- గంటలోపే చెరువును సందర్శించిన హైడ్రా సిబ్బంది

వట్టినాగులపల్లి గౌనిచెరువులో మట్టి పోస్తున్నారని హైడ్రా సిబ్బందికి ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

నార్సింగి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామంలో 19.ఎకరాల విస్తీర్ణంలో గౌని చెరువు ఉంది. దీన్ని కొంచెం కొంచెం కబ్జాలు చేయడం వలన ఇప్పుడు కేవలం 5.ఎకరాలే మిగిలింది. దీన్ని కూడా కబ్జా చేసేందుకు ఇటీవల కొందరు చెరువులో పెద్ద పెద్ద బండరాళ్లు, మట్టి నింపుతున్నారని స్థానికులు సోమవారం హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. కొందరు స్థానికుల అండతోనే కబ్జాదారులు చెరువును చెరబట్టేందుకు బరి తెగించారని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, చెరువును కబ్జా కాకుండా కాపాడాలని స్థానికులు హైడ్రా అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు అందుకున్న గంట సమయంలోనే హైడ్రా సిబ్బంది వట్టినాగులపల్లిలోని గౌనిచెరువుకు వచ్చారు. అక్కడ ఎవరు చెరువులో మట్టిపోస్తున్నారో తెలుసుకునేందుకు సీసీ కెమెరాలను పరిశీలించారు. చెరువులోకి మట్టిని తీసుకు వస్తున్న లారీల నెంబర్లు తెలుసుకొని వాటి యజమానులపై కేసులు పెడ్తామని హైడ్రా సిబ్బంది పేర్కొన్నట్లు స్థానికులు వివరించారు. హైడ్రా అధికారులు మా గౌని చెరువును కబ్జాదారుల చెర నుంచి విడిపించి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. హైడ్రా అధికారుల స్పందన మాకు చాలా సంతోషంను కలిగించిందని, హైడ్రా అడుగు పెట్టడంతో ఈ చెరువు కాపాడబడుతుందని భరోసా కలుగుతుందని స్థానికులు పేర్కొన్నారు.

ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహిళా క్రీడాకారులకు బహుమతులు ప్రధానం

మ్యూజికల్ చైర్స్ పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న అడిక్ మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్

చిక్కడపల్లి ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త) : అడిక్‌మెట్ డివిజన్ పరిధిలోని శోభ ఠాకూర్ బతుకమ్మ చౌక్ మరియు లలిత నగర్ కమిటీ హాల్ వద్ద మాధవి ఆధ్వర్యంలో మహిళలకు మ్యూజికల్ చైర్స్ పోటీల విజేతలకు డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ సోమవారం బహుమతులు అందించారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు జరుగుతున్న ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం లో భాగంగా, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ నేతృత్వంలో క్రీడా పోటీలలో ఉత్సాహంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు పాల్గొన్న మహిళలందరికీ ఆయన ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. మహిళలు ఇంటి పనులతో ఒత్తిడికి గురికాకుండా, క్రమం తప్పకుండా వ్యాయామం, వాకింగ్ మరియు క్రీడల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. క్రీడలు మనిషికి ఉల్లాసాన్ని ఇవ్వడమే కాకుండా ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల అవసరాలను తీర్చడమే లక్ష్యం

-సమస్యలను పరిష్కారించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

అత్తాపూర్ ఫిబ్రవరి 2,ప్రభాతవార్త : డివిజన్‌లలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం అత్తాపూర్ సర్కిల్ కాటెదాన్ డివిజన్‌లోని ఉద్దంగడ్డ,పల్లె చెరువు బస్తీలో అత్తాపూర్ సర్కిల్ డిసి సమ్మయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ విస్తృతంగా పర్యటించి బస్తీలలో నెలకొన్న ప్రజాసమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా అసత్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ లైన్లను పనరద్దరించడం,నిరంతర తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు,కొత్త సిసి రోడ్ల నిర్మాణ,వీధి దీపాల ఏర్పాటు,స్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కల్పనపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ....బస్తీలలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులు ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనుల నాణ్యతలో రాజీ పడకూడదని ఆయన స్పష్టం చేశారు. "ప్రజల కనీస అవసరాలను తీర్చడమే మా ప్రాధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ మృతితో కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు : ఎమ్మెల్యే

అడ్డగుట్ట,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 2వ వార్డు కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్యే శ్రీగణేష్ అనుచరుడు అడ్ల శ్రీనివాస్ ఆదివారం రాత్రి గుండెపోటుతో హఠల్ మరణం చెందారు. ఆయన మృతి చెందడంతో అడ్డగుట్ట,తుకారాంగేట్,కంటోన్మెంట్ 2వ వార్డు, మల్కాజిగిరి వానీ నగర్ ప్రాంతాల్లో విషాధ ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.శ్రీనివాస్ అంతిమ యాత్రలో పాడెను స్వయంగా మోసి కన్నీటీ విడ్కోలు పలికారు.

సీతారామస్వామి దేవాలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు

- ఈ నెల 8 నుంచి 12 వరకు ఉత్సవాలు

వివరాలు వెల్లడిస్తున్న కెవివి రాఘవాచార్యులు, చందుశర్మ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్‌లోని శ్రీ సీతారామస్వామి దేవాలయంలో 3వ మహాకుంభాభిషేక మహోత్సవాన్ని ఫిబ్రవరి 8 నుంచి 12 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రీ కంచి కామకోటి పీఠం వేద పాఠశాల నిర్వాహకులు చెర్రాబురి శ్రీరామ శర్మ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగనున్నాయి. వేడుకలకు సంబంధించిన వివరాలను సోమవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన అర్చకులు కెవివి రాఘవాచార్యులు, సుబ్రహ్మణ్య స్వామి ఆలయ అర్చకులు చందు శర్మ వెల్లడించారు. ఫిబ్రవరి 8వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు గణపతి పూజ, కలశస్థాపన, అంకురార్పణ కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక పూజలు, అర్చనలు జరుగుతాయని, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు హోమాలు, గ్రామబలి, మండపారాధనలు నిర్వహిస్తామని వెల్లడించారు. అదేవిధంగా ఫిబ్రవరి 8న గణపతి కళ్యాణం, 9న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం,10న ఆంజనేయ స్వామి కళ్యాణం, 11న సీతారామస్వామి కళ్యాణం,12న శివపార్వతుల కళ్యాణం ఘనంగా జరుగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు ఉదయం, సాయంత్రం యాగశాల పూజలు, హోమాలు, వేదపారాయణలు నిరంతరంగా కొనసాగుతాయన్నారు. ముఖ్య కార్యక్రమమైన మహాకుంభాభిషేకం ఫిబ్రవరి 12వ తేదీన ఉదయం 11.50 గంటల నుంచి 12.30 గంటల మధ్య శుభ ముహూర్తంలో ఉంటుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు మహాప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు శాంతికల్యాణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావాలని ఆలయ చైర్మన్ చల్లగల్ల వెంకట్రామ నరసింహం, ఆలయ సభ్యులు సునీత, నితీష్ కుమార్, బి.ఎస్.ఎస్. రెడ్డి కోరారు. 12న నిర్వహించే పూజా ఉత్సవాల ముగింపు రోజున పలు పీఠాధిపతులతోపాటు, ముఖ్యులు హాజరుకానున్నట్లు వివరించారు.

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి మగ్దూమ్ మొయినుద్దీన్

ప్రసంగిస్తున్న గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి త్యాగరాయ గానసభలో మగ్దూమ్ మొయినుద్దీన్ సంస్మరణ సమావేశం

చిక్కడపల్లి ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త) : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ నిర్వాహణలో జరుగుతున ఎందరో మహానుభావుల్లు కార్యక్రమ పరంపరలో భాగంగా సోమవారం గానసభలోని లలిత కళా వేదికపై ప్రముఖ విప్లవ కవి, స్వతంత్ర సమర యోధుడు మగ్దూమ్ మొయినుద్దీన్ సంస్మరణ సమావేశం అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దన మూర్తి అధ్యక్షణ జరిగింది. ఈ సందర్భంగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డపై నిజాం నిరంకుశ పాలన నుంచి, దొరల వెట్టిచాకిరీ నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు పోరాడిన ధీశాలి మగ్దూమ్ అని కొనియాడారు. కార్మిక సంఘ నాయకుడిగా, కవిగా, జర్నలిస్టుగా మగ్దూమ్ ఎప్పుడూ ప్రజల పక్షానే నిలిచిన అరుదైన కమ్యూనిస్టు నాయకుడని పేర్కొన్నారు. అభ్యుదయ భావజాలాన్ని అక్షరబద్ధం చేసిన ఆయనను ప్రతి ఏటా స్మరించుకోవడం గానసభ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాస్, ముంగరాజు రుక్మిణి, ప్రదీప్ చంద్ర, జి. సీత తదితర ప్రముఖులు పాల్గొని మగ్దూమ్ మొయినుద్దీన్ సేవలను, ఆయన రాసిన కవితలను స్మరించుకున్నారు.

ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన భారత సెపక్‌తక్రా జట్టు

భారత సెపక్‌తక్రా జట్టును అభినందిస్తున్న ఎస్.ఆర్. ప్రేమ్ రాజ్, పెరిక సురేష్ తదితరులు

హైదరాబాద్,ఫిబ్రవరి 2,ప్రభాతవార్త: జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్ 2026 టెస్ట్ ఈవెంట్‌లో భారత పురుషుల సెపక్‌టక్రా జట్టు అద్భుత ప్రదర్శనతో గోల్డ్ మెడల్ సాధించడం దేశానికి గర్వకారణమని సెపక్‌టక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీపెరిక సురేష్ ,సౌత్ ఏషియా ప్రెసిడెంట్ ఎస్.ఆర్. ప్రేమ్ రాజ్ హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో బలమైన పోటీదారులను ఓడించి విజయం సాధించి కీలక మైలురాయిని అదిగమించిందన్నారు. చీఫ్ కోచ్ హేమరాజ్ నాయకత్వంలో, సెక్రటరీ జనరల్ నరేష్ కుమార్ సమర్థవంతమైన నిర్వహణతో జట్టు ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. విజేతగా నిలిచిన భారత జట్టులో అకాష్ యుమ్నామ్, సందీప్ కుమార్, అరుణ్, రామ్ కుమార్, బాబీ కుమార్,

8న కేశవగిరిపై చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

- 10న స్వామివార్ల తిరుకల్యాణం

చెన్నకేశవస్వామి బ్రహోత్సవాల పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన స్వయంభుః శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ ప్రతినిధులు ఆవిష్కరించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు స్వామివారి పాదాలచెంత ఆహ్వాన పత్రికలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ ఆలయ మాజీ చైర్మన్లు జుర్కి రాజేందర్, కె.నాగరాజ, అర్చకులు కంజర్ల ప్రణయ్ కుమారాచార్యులు, భక్తులతో కలిసి పత్రికను విడుదల చేశారు. ఈనెల 8వ తేదీ ఆదివారం బ్రహోత్సవాలు ప్రారంభమై ఐదు రోజులు పాటు కొనసాగుతాయని వివరించారు. తొలి రోజున ధ్వజా రోహణం, 9వ తేదీ సోమవారం రాత్రి స్వామి అమ్మవార్ల ఎదుర్కోళ్లు, 10వ తేదీ మంగళవారం మధ్యాహ్నం స్వామివార్ల తిరుకల్యాణ మహోత్సవం, అన్న ప్రసాద వితరణ, రాత్రికి స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం, 11వ తేదీ బుధవారం ద్వార తోరణ పూజ, నారసింహ హవనం, 12వ తేదీ గురువారం మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, ధ్వజావరోహణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. గుట్టలో ఐదు రోజుల పాటు ఎంతో వైభవంగా జరిగే బ్రహోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చెన్నకేశవుని అనుగ్రహానికి పాత్రులు కావాలని వారు కోరారు.

సిఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీగణేష్

సిఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: విదేశీ పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం తెల్లవారు జామున శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దావోస్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సులో పాల్గొని తెలంగాణ పురోగతి తీరును రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను కంపెనీల ప్రతినిధులకు వివరించడం అభినందనీయమన్నారు.

అడ్డగుట్ట అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి : సౌందర్య

జిహెచ్ఎంసి కమీషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అడ్డగుట్ట బిజెపి అధ్యక్షురాలు సౌందర్య తదితరులు

అడ్డగుట్ట,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు,డ్రైనేజీ, మంచినీరు,నాలాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరుతూ సోమవారం డివిజన్ బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య గ్రేటర్ కమీషనర్ ఆర్.వి. కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గెల్లు ఉదయ్ యాదవ్, జి.హంసరాజ్,వెంకట్ స్వామి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిహెచ్ఎంసి ఎన్నికలలో ఉద్యమకారులకు అవకాశం ఇవ్వాలి

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఉద్యమకారులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలలో తెలంగాణ ఉద్యమకారులకు కార్పోరేటర్‌లుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీలో ఉండి, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులు కల్వ గోపి, జుగేందర్, రేషం మల్లేష్, సిరిగిరి శ్యాం, నేత శ్రీనివాస్, శ్యాంసుందర్ (చిట్టి), అజయ్ ముదిరాజ్, భిక్షపతి, పాశం రవి, పున్న సత్యనారాయణలు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం వారు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకుని, తెలంగాణ ఉద్యమంలో సైతం ముందుండి పోరాడిన తమకు జీహెచ్ఎంసీ ఎన్నికలలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా ఉద్యమకారులకు అవకాశం ఇచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గంకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

ఉపకులపతి రాజిరెడ్డిని కలిసిన టైమ్ స్కేల్ వర్కర్స్

అత్తాపూర్ ఫిబ్రవరి 2,ప్రభాతవార్త : కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం లో పని చేస్తున్న ఉద్యోగస్తులకు మెడికల్ రీయింబర్స్ మరియు టైమ్ స్కేల్ వర్కర్స్ కి కంపెన్సేషన్ గ్రాట్యుటీ 3 లక్షల ప్రొసీడింగ్స్ ఇచ్చినందుకు సోమవారం నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పోతురాజు యాదయ్య అధ్యక్షతన ఆధ్వర్యంలో టైమ్ స్కేల్ వర్కర్స్ అందరూ ఉపకులపతి దండా రాజి రెడ్డిని కలిసి పుష్ప గుచ్చులు అందజేశాసి శాలువాతో సన్మానించారు. అలాగే విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ భగవాన్‌కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రం లోని వివిధ రీసెర్చ్ స్టేషన్లు అశ్వారావుపేట నుండి రామరావు, రమణ, శ్రీనివాస్ , సంగారెడ్డి నుండి రత్నయ్య, జబ్బార్, కిషన్ , కొండా మల్లేపల్లి నుండి శ్రీనివాసులు, వెంకటేష్, మల్యాల నుండి అమీర్, వెంకన్న వచ్చారు. నాన్ టీచింగ్ అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి చెంచు రామయ్య, క్యాబినెట్ సభ్యులు రజినీ కాంత్, రాజేశ్వరి, వెంకటేష్, దీపారాణి, వంశీ కృష్ణ గౌడ్, రత్న కాంత్, అనిల్ రెడ్డి, వెంకటస్వామి, ముకేష్ శ్రీకాంత్, బెంజమిన్, విజయ్ కుమార్, హరి కృష్ణ, పెరిరెడ్డి, చంటి, ఉదయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే గణేష్

డైరీ మరియు క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్

ముషీరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: దళితుల సమగ్రాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ స్పష్టం చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఎస్సీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ఎస్సీఆర్‌పీఎస్ డైరీ మరియు క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ ముఖ్యమైన ఉత్తర్వులను, బహుజనులకు ఉపయోగపడే చట్టాలను, మహనీయుల జీవిత చరిత్రలకు సంబంధించిన ప్రధాన ఘట్టాలను ఎంతో విపులంగా ఒక దగ్గరకు చేర్చి, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ, తెలంగాణ ఆధ్వర్యంలో డైరీని రూపొందించటం అభినందనీయమన్నారు. రాష్ట్ర క్యాబినేట్ మంత్రుల శాఖలు, వివరాలు, ఫోన్ నెంబర్లతో పాటు మీడియా, ఆసుపత్రులు తదితర ముఖ్యమైన అంశాలను పొందుపరిచి, డైరీని ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారని కొనియాడారు. దళితుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అంబేద్కర్ భవన్‌ను పునరుద్ధరించటానికి కావల్సిన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ ఆవిష్కరణ సభలో కళానిధి మాస్టర్ జి.ఏ.ఐ. ఎస్సీ. ఆర్.పి.ఎస్. జాతీయ అధ్యక్షులు రాగల నాగేశ్వర రావు, ఎస్.నరసింహారావు, కే.గణేష్ భూపాలరావు, సలహాదారులు రాయల నర్సింగ్‌రావు, సమగ్ర జాతి అధ్యక్షులు వాగ్మారే, ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బుంగ శివకుమార్, ఏఐఎస్‌సీఆర్‌పీఎస్ మహిళా జాతీయ అధ్యక్షురాలు జి.ఎస్.వీణ, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు దాసరి యాదగిరి, ప్రధాన కార్యదర్శి పాకాల అశోక్, తెలంగాణ అధ్యక్షురాలు కృష్ణవేణి స్టాలిన్, గుంటి విజయబాబు, గంగం శివశంకర్, కురుమ మహేందర్, రాపాక అశోక్, మిద్దె లంగం, సెల్వరాజ్, మేకల అనంత కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరీ విరాళాల సేకరణలో ప్రథమ స్థానంలో నిలిచిన కే.వినోద్ కుమార్‌ను, రెండవ స్థానంలో నిలిచిన రుద్రారం శంకర్‌ను, మూడవ స్థానంలో నిలిచిన పరశురాంలను ఎమ్మెల్యే సన్మానించారు.

1వ వార్డు అభివృద్ధికి కృషి : జంపన

1వ వార్డు జయ నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 1వ వార్డు జయ నగర్,ప్రకాశ్ నగర్ ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు,డ్రైనేజీ, మంచినీరు సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. సోమవారం 1వ వార్డులోని జయనగర్,అకాశ్ నగర్,సంచారపురి కాలనీ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

4న నిమ్స్‌లో ఉచిత క్యాన్సర్ పరీక్షలు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పంజాగుట్ట నిమ్స్‌లో మెడికల్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న అవుట్ పేషెంట్ బ్లాక్‌లో ఉచిత క్యాన్సర్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్, 30 నుండి 60 సంవత్సరాల మధ్యలో వారికి రొమ్ము క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు ఎమర్జెన్సీ భవనం ట్రామా సెంటర్ వద్ద నుండి క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫ్రెండ్స్‌కాలనీలో బంచ్ కేబుల్

ఫ్రెండ్స్‌కాలనీలో విద్యుత్ సిబ్బంది తో బంచ్ కేబుల్ వేయిస్తున్న కార్పోరేటర్ ముద్దం.

బేగంపేట ఫిభ్రవరి 2,ప్రభాతవార్త

ఓల్డ్‌బోయిన్ పల్లి డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్‌కాలనీలో కార్పోరేటర్ ముద్దం విద్యుత్ శాఖ అధికారులతో కల్సి పర్యటించారు.ఈ సందర్భంగా స్థానికుల అభ్యర్థన మేరకు బంచ్ కేబుల్ వేయించారు.డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే వాటిని సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసికెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ ముద్దం తో పాటు ఫ్రెండ్స్ కాలనీ వాసులు రాములు, చందర్‌గౌడ్,యాదగిరి,ఇతర బస్తీవాసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు కార్పోరేటర్ కి ధన్యవాదాలు తెలియజేసారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా మూడవ తేదీ మంగళవారం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు తానాజీ ఫీడర్ పరిధిలో,12 నుంచి 2 గంటలు వరకు శారదా కళాశాల,షాజహాన్ ఫీడర్లు,3 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకు గౌలిపుర,డార్జలింగ్ స్కూల్ ఫీడర్ల పరిధులలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు సిబిడి అధికారులు తెలిపారు.

బిఆర్ఎస్ నేతలపై రెండు వేర్వేరు కేసులు నమోదు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిట్ విచారణ నేపథ్యంలో బీఆర్ఎస్ భవన్ వద్ద రెండు వేర్వేరు సంఘటనల్లో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణ భవన్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ నేతలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాలు వసంతతోపాటు మరికొందరు అక్కడే విధుల్లో ఉన్న బంజారాహిల్స్ కానిస్టేబుల్ అనూషను నెట్టివేయడంతోపాటు ఆమె చేతి వేళ్లను విరిచారు. ఈ సంఘటనలో అనూష బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వసంత తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక బీఆర్ఎస్ భవన్ వద్ద ఆందోళనను చిత్రీకరిస్తున్న వీడియోగ్రాఫర్‌పై కొందరు బీఆర్ఎస్ నేతలు దాడికి పాల్పడ్డారు. వీడియోగ్రాఫర్‌పై దాడి చేయడంతోపాటు కెమెరాను ధ్వంసం చేశారు. దీంతో వీడియోగ్రాఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేసినట్లు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు. అంతకముందు బంజారాహిల్స్‌లోని మంత్రుల ప్రాంగణ సముదాయం వద్ద ముట్టడికి యత్నించిన గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తపాటు పలువురిని ముందస్తుగా అరెస్ట్ చేసి వారిపై ముందస్తు అరెస్ట్ కింద కేసు నమోదు చేశారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక ఆర్య వైశ్యులు : మంత్రి శ్రీధర్‌బాబు

అలిండియా ఆర్యవైశ్య ఇండస్ట్రియలిస్ట్ ఫోరం సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త

దేశ ఆర్థిక వ్యవస్థకు ఆర్యవైశ్యులు వెన్నుముకగా నిలుస్తున్నారని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం (ఎఐఎవిఐఎఫ్) రజతోత్సవ వేడుకలను ఆదివారం రాత్రి నానక్‌రామ్‌గూడ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ లోని ప్రధాన్ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎఐఎవిఐఎఫ్ అధ్యక్షులు రాంబాబు పబ్బిశెట్టి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బత్తుల, సంయుక్త కార్యదర్శి కాశి విశ్వనాథం చింత, ట్రెజరర్ విజయ ప్రసాద్ గుంపల్లి, కన్వీనర్ మంచి రాజశేఖర్, మీడియా చైర్మన్ ఎర్రం బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. తొలుత జ్యోతి ప్రజ్వలన, వాసవి మాత పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రసంగిస్తూ దేశానికి స్వతంత్రం రాక ముందు నుంచి నేటి వరకు ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మేమున్నా మని ఆర్యవైశ్యులు అండగా నిలబడుతున్నారని అన్నారు. 2008-09 ప్రపంచ స్థాయిలో ద్రవ్యోల్బణం ఏర్పడినపుడు కేవలం భారత దేశం మాత్రమే పటిష్టంగా ఉందని, అందుకు కారణం ఆర్యవైశ్యులు అని మంత్రి కొనియాడారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణం గా ఆర్యవైశ్య లు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)ను వినియోగాన్ని ఉపయోగించు కుని వ్యాపార, వాణిజ్య రంగాలలో మరింత ముందుకు కొనసాగాలని శ్రీదర్‌బాబు ఆకాంక్షించారు. ఒకప్పుడు కస్టమర్ షాపుకు వచ్చేవాడని, ఇప్పుడు బిజినెస్ కస్టమర్ దగ్గరకే వెళ్తోందని చెప్పారు. టెక్నాలజీ ఇప్పు డు ఆప్షన్ కాదు, అవసరమని అన్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, ఆటోమే షన్ వంటి ఆధునిక టెక్నాలజీలు కేవలం ఐటీ కంపెనీలకే కాకుండా సంప్రదాయ వ్యాపారాలను స్మార్ట్ బిజినెస్ లుగా మార్చ డానికి ఉపయోగపడ తాయని మంత్రి వివరించారు. గత రెండేళ్లలో తెలం గాణ పారిశ్రామికవే త్తలకు స్వర్గధామంలా మారిందని, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెం ట్ డెస్టినేషన్‌గా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో రా ష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, ఎమ్మెల్సీ బొగ్గారాపు దయా నంద్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. యువ పారిశ్రామిక వేత్తల ను ప్రోత్స హించేందుకు ఏర్పాటు చేసిన 50 స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఉస్మానియా ప్రొఫెసర్ డా.భూమేష్‌కుమార్‌కు అంతర్జాతీయ అవార్డు

హైదరాబాద్,ఫిబ్రవరి 2,ప్రభాతవార్త: ఉస్మానియా డెర్మటాలజీ విభాగం అధిపతి ప్రొ.భూమేష్ కుమర్‌ను అంతర్జాతీయ అవార్డు వరించింది. బెంగళూరులో జరిగిన ఇంటర్నేషనల్ లీగ్ ఆఫ్ డెర్మటాలజికల్ సొసైటీ (ఐఎల్‌డీఎస్) సదస్సులో ఆసియా హ్యూమనిటేరియన్ డెర్మటాలజీ 2025 అవార్డును ప్ర ధానం చేశారు. ఈ సందర్భంగా డా.భూమేష్ కుమార్ మాట్లాడుతూ 26 ఏళ్లుగా అంకితా భావం, నైతిక, సమానత్వం, మానవతా, వైద్య విలువలను ప్రతిబింబిస్తూ చర్మరోగ వై ద్యంలో అపూర్వ సేవలందించినందుకు ఐఎల్‌డీఎస్ ఈ అవార్డుతో సత్కరించిందన్నారు. కమ్యూనిటీ డెర్మటాలజీ, కుష్ఠురోగ నిర్మూలన, పిల్లల చర్మరోగాలు, హెచ్ఐవీ, ఎస్‌టీడీ సం రక్షణ, నిరక్ష్యం లేని చేయబడిన చర్మరోగాల నిర్వహణ, తదితర అంశాల్లో వెనుకబడిన, గ్రామీణ ప్రాంతాలతో పాటు, ఉస్మానియాలో అందించిన సేవలను పరిగణలోకి తీసుకున్నారని తెలిపా రు. ఆసియాలో 120 దేశాల వైద్యులకు ప్రాతినిధ్యం వహించే సొసైటీలో భారతదేశానికి మొదటి సారి ఈ అవార్డు రావడం గర్వకారణంగా ఉందని డా.భూమేష్‌కుమార్ అన్నారు.

సామాజిక భవనం పనులను ప్రారంభించిన కార్పొరేటర్

పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి.

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః

ఖైరతాబాద్ డివిజన్ రామకృష్ణానగర్‌లో రూ. 11 లక్షలతో సామాజిక భవన నిర్మాణ పనులను సోమవారం డివిజన్ కార్పొరేటర్ విజయారెడ్డి ప్రారంభించారు. స్థానికులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఇక్కడ నూతనంగా ఈ భవన నిర్మాణ పనులను చేపడుతున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బస్తీనేతలతోపాటు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి గెలుపుకు మహిళలు కృషి చేయాలి

- మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ వీరపనేని పద్మ

సమావేశంలో పాల్గొన్న డాక్టర్ పద్మ వీరపనేని, చిత్రంలో రాంచందర్‌రావు ఇతర బీజేపీ నేతలు ఉన్నారు.

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు ప్రతి ఒక్క మహిళ కృషి చేయాలని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గసభ్యురాలు, తమిళనాడు రాష్ట్ర ఎన్నికల ఇంచార్జి డాక్టర్ పద్మ వీరపనేని అన్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు మహిళా మోర్చా పాత్రపై బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పార్టీ అధ్యక్షుడు రామచందర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రతి మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు తమ వంతుగా కృషిచేసి పార్టీ గెలుపులో కీలకపాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ, మండల స్థాయిలో బీజేపీ బలంగా ఉందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో తెలంగాణ మహిళా మోర్చ మహిళలు బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆమె తోపాటు పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు. ప్రజలు ఇప్పటికే ఎన్నో ఇబ్బం దులకు గురయ్యారన్నారు. మోడి నేతృత్వంలో దేశం ముంద డుగు వేస్తుందని, ఇందులో భాగస్వాములం కావడానికి రాష్ట్రం లోనూ బీజేపీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. రాను న్న అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు ఇప్పటి నుంచే బీజాపీ శ్రేణులు, ప్రధానంగా

మహావీర్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
ప్రధాన కార్యాలయం : 7-1-59/7, ఇండియన్ బ్యాంక్ ఎదుట, ప్లాస్టిక్ వరల్డ్ ప్రక్కన, అమీర్‌పేట్, హైదరాబాద్-500016, మెయిల్ ఐడీ : ho@mahavdeerbank.com

స్వాధీనతా ప్రకటన
(స్థిరాస్తి కొరకు)
[నిబంధన 8(1)]

ఇదిలా ఉండగా,
మహావీర్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, దిగువ సంతకందారు H.O. అమీర్‌పేట్, హైదరాబాద్, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ [చట్టం 2002 (54 ఆఫ్ 2002)] క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క (నియమం 3)తో చదవబడిన 13 (12) సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ తేదీ 25.11.2025 డిమాండ్ నోటీసు జారీ చేసారు. రుణగ్రహీత శ్రీ P. సందీప్, ఇ.నం.18-3-508/డి/22, శివ గంగ నగర్, చత్రినాక, ఫలక్‌నుమా, రుణగ్రహీత మరియు ఆస్తి యజమాని శ్రీ P. సందీప్, ఇ.నం.18-3-508/డి/22, శివ గంగ నగర్, చత్రినాక, ఫలక్‌నుమా, నోటీసులో పేర్కొన్న మొత్తం రూ.25,76,848/- (రూపాయలు ఇరవై ఐదు లక్షల డెబ్బై ఆరు వేల ఎనిమిది వందల నలభై ఎనిమిది మాత్రమే) 31.10.2025 వరకు వడ్డీ కలుపుకొని ఉన్న మొత్తాన్ని సదరు నోటీసు తేదీ 25.11.2025 యొక్క తేదీ నుండి 60 రోజులలోపుగా తిరిగి చెల్లించవలసినదిగా పిలుపు ఇవ్వడమైనది.
రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, ఇందుమూలముగా రుణగ్రహీత, ఆస్తి యజమాని, హామీదారుడు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా దిగువ సంతకందారుడు కింద వివరింపబడిన ఆస్తిని సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో పాటు చదవబడిన ఆ ఆర్డినెన్స్‌లోని సెక్షన్ 13 (4) కింద అతనికి ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి క్రింద వివరించిన ఆస్తిని 2వ ఫిబ్రవరి 2026న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు, ఆస్తి యజమానులకు, హామీదారులకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది.
రుణగ్రహీత, ఆస్తి యజమాని మరియు హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించబడమైనది ఏమనగా ఆస్తితో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదు. మరియు ఆస్తితో ఏదైనా వ్యవహారాలు జరుపునట్లయితే మహావీర్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఛార్జీకి మొత్తం సొమ్ము రూ.26,72,875/- (రూపాయలు ఇరవై ఆరు లక్షల డెబ్బై రెండు వేల ఎనిమిది వందల డెబ్బై ఐదు మాత్రమే) (31.01.2026 వరకు వడ్డీ కలుపుకొని) మరియు భవిష్యత్ వడ్డీ మరియు దానిపై ఛార్జీలకు లోబడి ఉండును.
సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది.

స్థిరాస్తి యొక్క వివరణ
తెలంగాణ, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, మేడ్చల్ మండలం, గుండ్ల పోచంపల్లి గ్రామ మరియు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న సర్వే నం.8/2లో ఫ్లాట్ నం.3 & 4పై హిరెల్ హైట్స్‌లో 99.9 చ.గ. కొలత భూమి యొక్క UDS తో 2161 చ.అ. ఫ్లింత్

పాల్‌మేటం పార్కు వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయకుమార్

నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వేముల విజయకుమార్ ను సన్మానిస్తున్న బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: ఓల్డ్ మలక్ పేట్ పాల్ మేటం పార్కు వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేముల విజయకుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పిఎస్ఆర్ చంద్ర మూర్తి, ప్రధాన కార్యదర్శిగా నసీరుద్దీన్, సంయుక్త కార్యదర్శిగా ముఖ్య ప్రాన్, కోశాధికారిగా ఎస్ బి షేక్ లు ఎన్నికయ్యారు. శ్రీ పోచమ్మ దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు నూతన కమిటీకి పుష్పగుచ్చాలని అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వాకర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు వేముల విజయకుమార్ మాట్లాడుతూ నడకతో చక్కటి ఆరోగ్యాం చేరుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య సంరక్షణ కోసం నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, చౌకిరాజు, శివకుమార్‌గౌడ్, వినోద్ కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

వనస్థలిపురంలో ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన

వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న మహిళలు

వనస్థలిపురం ఫిబ్రవరి.2.ప్రభాతవార్త వనస్థలిపురం హుడా ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండి క్రాఫ్ట్ మేళా వస్త్ర ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంటున్నది. ఈ ప్రదర్శన లో మంగళగిరి, ఉప్పాడా, వెంకటగిరి చీరలు, భాగల్ పూర్, డిజైనర్ చీరలు, కాంత వర్క్ చీరలు, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలు, లేడీస్ ఫాన్సీ టాప్స్, బెంగాలీ కాటన్ చీరలు, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు తదితర వస్తువులు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయి. ఈ వస్త్ర ప్రదర్శన కొద్దిరోజులు మాత్రమే నిర్వహించబడుతుందని , ఈ అవకాశాన్ని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు ఆలీ తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది : కరస్పాండెంట్ అంకిత రెడ్డి

విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ అంకిత రెడ్డి తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదనీ సెంట్ డామ్నిక్స్ పాఠశాల కరస్పాండెంట్ అంకిత రెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట సలీంనగర్‌లోని సెంట్ డమ్నిక్స్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల ప్రతిభా ప్రయాణం ఉడాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అంకితా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ గురువులను గౌరవించినప్పుడే పరిపూర్ణమైన విజ్ఞానం లభిస్తుందని పేర్కొన్నారు. పాఠశాల నిర్దేశించిన విలువలు, నైతిక సూత్రాలకు తల్లిదండ్రులు కట్టుబడి ఉన్నప్పుడే పిల్లల అభివృద్ధి సాధ్యమవుతుందని, పిల్లలతో మనం ఏర్పరుచుకుని ఆత్మీయ బంధం, మనం నేర్పే విలువలే వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాయని వివరించారు. విలువల పునాదిపై పెరిగినప్పుడే పిల్లలలో నిజమైన ఎదుగుదల కనిపిస్తుందని, ఆ బాధ్యతను పాఠశాల, తల్లిదండ్రులు సమిష్టిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సృజనాత్మకతను వెలికితీయడానికికృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదేవిధంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో జాంబవంతుని ఆలయాలు నిర్మించాలి

తాళ్లపల్లి లింగంను రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా నియమించిన దృశ్యం

కుషాయిగూడ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త ఆది జాంపవంతుని చరిత్ర గ్రామ గ్రామాన వ్యాపింప చేయాలని ఆది జాంబవ ధర్మ సమాజం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి లింగం పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ ఎస్ బి కాలనీ మీర్పేట్ కి చెందిన తాళ్లపల్లి లింగం సేవలను గుర్తించి ఆది జాంబవ ధర్మ సమాజం రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల అధ్యక్షునిగా నియమిస్తూ రాష్ట్ర కమిటీ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కమిటీ వారు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది జాంబవంతుని చరిత్ర వైభవాన్ని కొలవడానికి ప్రతి నగరంలో గ్రామంలో ఆలయాలు నిర్మించాలని పేర్కొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు ఎంతో మేలు: కార్పొరేటర్

క్రీడాకారులతో కార్పొరేటర్, తహసీల్దార్

హయత్ నగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : క్రీడలు విద్యార్థులలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి దోహద పడ తాయని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ లోని వర్డ్ అండ్ డీడ్ పాఠశాలలో నిర్వహించిన చీఫ్ మినిస్టర్ కప్ ను ఆయన సోమవారం తహసీల్దార్ జానకి, ఎంఈఓ శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు సమానమైన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. టోర్నమెంట్ లో పాల్గొంటున్న విద్యా ర్థులు ఖో ఖో, కబ్బడీ, వాలీబాల్, ఫుట్ బాల్ లో చక్కని ప్రతిభను కనబరిచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదిగి మంచి పేరు సాధించాలన్నారు. డివిజన్‌లో విద్యా, క్రీడా రంగాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తాన న్నారు. కార్యక్రమంలో వర్డ్ అండ్ డీడ్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రియదర్శిని పాల్గొన్నారు.

మహిళల భద్రతే మా ప్రథమ లక్ష్యం : డిసిపి ఉషారాణి

నేరేడ్ మెట్,మల్కాజ్‌గిరి కమిషనరేట్,ఫిబ్రవరి 2,ప్రభాతవార్త : మహిళలు, బాలికలను వేధించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని మల్కాజ్‌గిరి కమిషనరేట్ మహిళా భద్రత డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ టి. ఉషారాణి స్పష్టం చేశారు. మహిళలు భయం లేకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో షీ టీమ్స్ సాధారణ దుస్తుల్లో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ వేధింపులకు పాల్పడే వారిని పట్టుకుంటున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులపై కేసులు నమోదు చేసి, కోర్టులకు హాజరుపరుస్తూ, కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ అందిస్తున్నామని వెల్లడించారు. జనవరి 1 నుంచి 15 వరకు మొత్తం 97 ఫిర్యాదులు అందగా, 81 మందిని (64 మేజర్లు, 17 మైనర్లు) షీ టీమ్స్ అదుపులోకి తీసుకున్నాయి. వీటిలో ఫోన్ కాల్స్ ద్వారా వేధింపులు 17, సోషల్ మీడియా ద్వారా 36, ప్రత్యక్ష వేధింపులు 44గా నమోదయ్యాయి. 9 క్రిమినల్ కేసులు, 29

పెట్టీ కేసులు నమోదు కాగా, 52 మందికి కౌన్సెలింగ్ అందించారు. ఈ నెలలో 36 అవగాహన కార్యక్రమాల ద్వారా సుమారు 4,566 మందికి మహిళా హక్కులు, చట్టాలు, భద్రతపై అవగాహన కల్పించారు. మెట్రో రైళ్లలో నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్లలో మహిళల కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణించిన ముగ్గురు పురుషులపై జరిమానాలు విధించారు. వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు మల్కాజ్‌గిరి షీ టీమ్ వాట్సాప్ నంబర్ 8712662111 లేదా సంబంధిత షీ టీమ్ నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

నిర్ణయలోపాలు, అవినీతి, అక్రమాలే మదర్ డెయిరీ నష్టలకు కారణం: గుత్తా జితేందర్ రెడ్డి

-పాలకవర్గం తొలగింపు కోసం ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలంటూ నోటీసు

హయత్ నగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : సమయానుకుల నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమై అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న నార్ముల్ మదర్ డెయిరీ పాలకవర్గం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షులు సోమవారం ఇంచార్జి ఎండీ అబ్దుల్ గఫార్ కు నోటీసు అందించారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ... పాడి రైతులకు 4 నెలలుగా పాల బిల్లులు చెల్లించక పోవడం, ఉద్యోగులకు 2 నెలలుగా వేతనాలు అందిచక పోవడానికి పాలకవర్గం అసమర్థతే కారణ మన్నారు. బ్యాంకు నుండి తీసుకున్న రుణాలు చెల్లించక పోవడంతో తనఖా పెట్టిన స్థిరస్థులను వేలం పెట్టె పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. నెలవారిగా వేతనాలు అందకపోతే ఉద్యోగాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న టారని తెలిపారు. పాలక

ఎండీకి నోటీసు అందిస్తున్న సొసైటీ చైర్మన్లు

వర్గం వైఖరి కారణంగా సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీనికంతటికి కారణమైన పాలకవర్గం పదవిలో కొనసాగే అర్హతను కోల్పోయిందన్నారు. యూనియన్ బైలా సెక్షన్ 19 ప్రకారం పాలకవర్గన్ని తొలగించడానికి ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ 234 మంది సొసైటీ చైర్మన్ల సంతకాలతో కూడిన నోటీసును ఎండీకి అందించారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్లు ఒగ్గు బిక్షపతి, దొంతిరి సోమిరెడ్డి, పాల సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

నాచారం డివిజన్‌లో కార్పొరేటర్ భర్తపై దాడి

నాచారం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : జీహెచ్ఎంసీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో అప్పుడే నాచారంలో రాజకీయ సెగ తగిలింది. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఓ బోర్‌వెల్ విషయంలో గొడవకు దిగారు. రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. తనను బూతు మాటలు తిట్టి తనపైనే కేసు నమోదు పెట్టాడరని బీజేపీ జిల్లా నాయకుడు గోపాల్ గౌడ్ ఆరోపించగా తాను రైతు బజారులో స్వంత ఖర్చుతో బోరు మరమ్మతులు చేయించగా గోపాల్ గౌడ్ అతని అనుచరులు తనపై దాడి చేయడంతో చేతికి గాయమై రక్తం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను క్యాన్సర్ పెషెంటునని తనపై బిజేపి వారు దాడి చేయడం ఎంతవరకని ప్రశ్నించారు. నాచారం రైతు బజార్‌లో బోరు మోటార్ వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు తెగతెంపులు చేయడంతో నీటి సమస్య ఏర్పడిందని ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని సాయిజన్ పేర్కొన్నారు. నాచారం డివిజన్ కార్పొరేటర్ మహిళలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని తమ సొంత ఖర్చులతో బోరు మోటార్ రిపేర్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో బోరు రిపేర్ జరుగుతున్న ప్రదేశానికి వచ్చిన బీజేపీ నాయకుడు పోతగాని గోపాల్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు

తనపై జరిగిన గాయాన్ని చూపిస్తున్న కార్పొరేటర్ భర్త సాయిజన్ శేఖర్

ఫోటోలు దిగడంతో వాగ్వాదం చోటుచేసుకుందన్నారు. కార్పొరేటర్‌ను, తరువాత అక్కడికి వచ్చిన ఆమె భర్త సాయిజన్ శేఖర్‌ను ఉద్దేశించి గోపాల్ గౌడ్ అనుచిత వ్యాఖ్యలు చేశాడన్నారు. దీంతో తాము వాగ్వాదం తోపులాటకు దారి తీయడంతో చేతిపై తీవ్ర గాయాలు, రక్తస్రావం జరిగింది. ఈ ఘటనపై కార్పొరేటర్ దంపతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాచారం డివిజన్‌లో అభివృద్ధిని అడ్డుకునే ఉద్దేశంతో రాజకీయ ప్రత్యర్థులు కావాలనే దాడులు, దుష్ప్రచారం చేస్తున్నారని కార్పొరేటర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఈ ఘటనపై నాచారం పోలీసులను వివరణ కోరగా ఇరు వర్గాలపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు

-మహేశ్వరం బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయనీ ఆ పార్టీలను ప్రజలను నమ్మరని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల బిజెపి ఎన్నికల ఇంఛార్జి అందెల శ్రీరాములు వ్యాఖ్యానించారు. మీర్‌పేట్ బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని ప్రశాంతిహిల్స్ డివిజన్ నుండి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, గత మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొక్క నరేంద్రకుమార్ (నందు) సోమవారం బిజెపిలో చేరారు. ప్రశాంతిహిల్స్ డివిజన్ నుండి వందలాది మంది యువకులతో ఆయన భారీ ర్యాలీ నిర్వహించి నాదర్‌గుల్‌లోని నియోజకవర్గ బిజెపి కార్యాలయంలో అందెల సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు బిజెపిలో చేరిన బిఆర్ఎస్ నాయకులు శంకర్ నాయక్, కొండల్, వెంకట్, శైలేష్ తదితరులకు శ్రీరాములు యాదవ్ బిజెపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు గాలికి వదిలేసి స్వార్థ రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు వచ్చే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రధాని

బిజెపిలో చేరిన మాజీ కార్పొరేటర్ మొక్క నరేంద్రకుమార్‌కు పార్టీ కండువాల వేస్తున్న మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్

నరేంద్ర మోడి పాలనను గమనిస్తున్న ప్రజలు తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. రానున్న అన్ని ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బిజెపి జెండాలు ఎగురవేస్తామని శ్రీరాములు యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ పార్టీ కన్వీనర్ యెల్మేటి దేవేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు మద్దిరాజశేఖర్‌రెడ్డి, ద్యాసాని తిరుపతిరెడ్డి, ఇంద్రావత్ రవినాయక్, రాత్లావత్ నీలా రవినాయక్, ఎ.భీమ్‌రాజ్, చెవ్వ శ్రవణ్, జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, సిద్దాల శ్రీనివాస్, శ్రీను నాయక్, గడ్డం దాసు, మన్యం రవీందర్‌రెడ్డి, రాఘవేందర్, బొంత కృష్ణలతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం : పరమేశ్వర్‌రెడ్డి

రామంతాపూర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీతోనే ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందని ఉప్పల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రామంతాపూర్ భరత్‌నగర్‌లో పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పలువురు యువకులకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన నడుస్తుందని, ప్రజాపాలనలో పేదలకు తగు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలతో అన్ని పార్టీల దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లీందన్నారు. ఈ సందర్భంగా రామంతాపూర్ భరత్‌నగర్‌కు చెందిన రామరాజ్, వినీత్, మహేందర్, అజయ్, రాజేష్, విజయ్, అరుణ్, శేఖర్, విన్నూ యాదవ్, లక్ష్మణ్, గౌతం, సాయి బాబు, క్రిస్నా, కిషోర్, రాకేష్, యశ్వంత్, తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ రఫిక్, టిపిసిసి ప్రతినిధి మహ్మద్ తౌఫిక్, వర్కింగ్

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న భరత్‌నగర్ కాలనీ యువకులు దృశ్యం.

ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కంది శ్రవణ్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, జిలీల్ పాషా, బుక్క సురేష్, గరిక సుధాకర్, శామ్యూల్, గుండమనేని భాస్కర్ గంగపుత్ర, పెద్దిరాజు సందీప్, భాస్కర్, సాగ శ్రీధర్, ముత్యాల బాబు, , సీమగండ్ల జంగయ్య, ముత్యాల జంగయ్య, అంబిక తదితరులు పాల్గొన్నారు.

గత పాలకవర్గం తీర్మాణించిన పనులు పూర్తయేటట్లు చేయాలి

-శంషాబాద్ జడ్‌సికి బడంగ్‌పేట్ బిజెపి మాజీ కార్పొరేటర్ల వినతి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: జిహెచ్ఎంసిలో విలీనం కాక ముందు ఉన్న బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గత పాలకవర్గ తీర్మాణం చేసిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని బిజెపికి చెందిన మాజీ కార్పొరేటర్లు శంషాబాద్ జోనల్ కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు మాజీ కార్పొరేటర్ల బృందం సోమవారం శంషాబాద్‌కు తరలివెళ్ళి అక్కడ జడ్‌సి చంద్రకళను కలిసి ఒక వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు మాట్లాడుతూ అల్మాస్‌గూడ కోమటికుంట చెరువు నుండి మీర్‌పేట్ పెద్ద చెరువు వరకు చేపట్టిన ఎస్ఎన్‌డిపి నాలా పనులను పూర్తి చేయించాలనీ నాదర్‌గుల్, బడంగ్‌పేట్, బాలాపూర్ డివిజన్లలోని కొత్త కాలనీల్లో జిహెచ్ఎంసి బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయించాలని కోరారు. మాజీ కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, తోట శ్రీధర్‌రెడ్డి, గూడెపు ఇంద్రసేనలతో పాటు రామిడి వీరక ర్జారెడ్డి, రామోజీ శ్రీశైలంచారి, బంగారు ప్రభాకర్, శ్రీనివాస్‌లు ఉన్నారు.

ఉప్పల్‌లో అడిషనల్ కమిషనర్ విజయకృష్ణారెడ్డి పర్యటన

ఉప్పల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అడిషనల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సోమవారం అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఉప్పల్‌లో ఒటిఎస్ స్కీం ద్వారా ఆస్తిపన్ను వసూలు విధానం, అధికారుల పనితీరును పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒటిఎస్ స్కీం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా ఒక వాణిజ్య సముదాయం పన్ను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలతో సమావేశం అయ్యారు. ఇంటింటి సర్వే చేసిన అర్హులైన మహిళలను గుర్తించాలని సూచించారు. మహిళల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ జి.రాజు, ఎఎంసి ఎ.సంధ్య, టిఐ యాదగిరి, రాంరెడ్డి, డిప్యూటి ప్రాజెక్ట్ ఆఫీసర్ పద్మావతి పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం తగదు

మల్కాజిగిరి ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : మల్కాజిగిరి లోని హనుమాన్ వ్యాయామశాల అతి పురాతనమైనది ,ఎందరో క్రీడాకారులు ఇదే వ్యాయామశాలలో వ్యాయామం చేసి అవా ర్డులు అందుకున్నా చరిత్ర హనుమాన్ వ్యావమాషాల్‌కి ఉంది. అలాంటి వ్యాయాంశాలని అభివృ ద్ధి చేస్తుంటే కొంతమంది నాయకులు అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడే ప్రయత్నం చేస్తున్నారని హనుమాన్ వ్యాయామశాల సభ్యులు మల్కా జిగిరి జోనల్ కమీషనర్‌కి ఫిర్యాదు చేసారు. కొంతమంది నాయకులు వ్యాయామశాల స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని అందులో భాగంగానే వ్యాయాంశాల అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడుతున్నారని వ్యాయాంశాల సభ్యులు ఆరోపించారు. హనుమాన్ వ్యాయామశాల అభివృద్ధి చెందు తే ఎందరో యువకులు ఇందులో కసరత్తు చేసి దృఢంగా త యారవుతారని , తద్వారా క్రీడా రంగంలో మల్కాజిగిరి పేరు చిరస్థాయిలో నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు. కార్యక్ర మంలో హనుమాన్ వ్యాయామశాల ప్రెసిడెంట్ జ్ఞానేశ్వర్ జనరల్ సెక్రెటరీ వ్యాయామశాల శ్రీనివాస్, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, సునీల్ యాదవ్, జై కృష్ణ, రాంచేందర్, బాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

అమ్మసాని రాజి రెడ్డి కాలనీలో సిసి కెమేరాలు ప్రారంభం

బోడుప్పల్ సర్కిల్ అమ్మసాని రాజిరెడ్డి కాలనీలో సీసీ కెమెరాలు ప్రారంభించిన మేడిపల్లి డీఐ ఎలక్షన్ రెడ్డి, కొత్త కిషోర్ గౌడ్ ను సన్మానించిన అమ్మసాని రాజిరెడ్డి, కాలనీవాసులు

బోడుప్పల్ ఫిబ్రవరి2 ప్రభాతవార్త ; ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, నిందితులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని మేడిపల్లి డీఐ ఎలక్షన్ రెడ్డి ,మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ అన్నారు. జీహెచ్ఎంసీ బోడుప్పల్ సర్కిల్ అమ్మసాని రాజి రెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు ఇరవై సీసీ కెమెరాలను డీఐ ఎలక్షన్ రెడ్డి ,మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రదాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో సీసీ కెమోరాలు అందుబాటులోని వస్తున్నట్లు తెలిపారు. నేరాలను నియంత్రించేందుకు, అసాంఘికకార్యకలాపాలు జరగకుండా ప్రశాంతమైన వాతవరణం కల్పించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతి కాలనీ లలో సీసీ కెమెరా లను ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన అమ్మసాని రాజిరెడ్డి కాలనీ వాసులను డీఐ అభినందించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అమ్మసాని రాజిరెడ్డి ,ప్రదాన కార్యదర్శి సంపత్ ,కాలనీ వాసులు మల్లేష్ ,శ్రీనివాస్ అమ్మసాని రాజిరెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కమిటీ

హుడాకాంప్లెక్స్,ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : గడ్డి అన్నారం డివిజన్ పరిధిలోని కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నుకోబడింది. అధ్యక్షునిగా తులసి శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శిగా ఏ.నర్సింహ్మారావు, ఉపాధ్యక్షులుగా అనంద్‌కుమార్, బుచ్చయ్య, రాము, నాగభూషణంలు, కార్యదర్శులుగా బాబురావు, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రవికుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కారదర్శులు మాట్లాడుతూ మాపై నమ్మకంతో అప్పగించిన ఈ పదవిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తామన్నారు. నూతన కమిటీ సహాయ, సహకారాలతో కాలనీ అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని తెలిపారు.

శ్రీనగర్ కాలనీలో బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ పర్యటన

శ్రీనగర్ కాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : చిలుకానగర్ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పలువురు కాలనీ నేతలతో కలిస